### అపొస్తులుడైన పౌలు

# తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక

ఈ పత్రిక కూడ పౌలు వ్రాసిన పత్రికయే అని చెప్పుటకు ఏ సందేహము లేదు. యౌవనస్థుడైన తిమోతికి జ్ఞానోపదేశమే ఈ పత్రిక ముఖ్యోద్దేశము. సంఘపరిపాలన, సంఘములోని పెద్దల నియామకము, శారీరిక నిగ్రహము, సంఘములోని వృద్ధులను గూర్చి, వితంతువులను గూర్చి, సంఘస్థుల బాధ్యతను గుర్తుచేయుచు, అబద్ధ బోధకులను గూర్చి కలిగి వుండవలసిన మెళకువలను ఇంకా ఎన్నో సంఘపరమైన విషయములను గూర్చి విపులముగా పౌలు తిమోతికి ఈ పత్రికలో వివరించెను.

**తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక- అనుక్రమణిక**

| అధ్యా. వచ | పాఠ్య సారాంశము |
|---|---|
| 1:1-5 | శుభములు-కృతజ్ఞతాస్తుతి |
| 1:6-18 | ప్రోత్సాహము కొరకైన హెచ్చరికలు |
| 2:1-13 | హెచ్చరికలు |
| 2:14-26 | వాదమువద్దని పౌలు హెచ్చరిక |
| 3:1-9 | అంత్యదినములలో జరుగు అపాయములు |
| 3:10-17 | తిమోతి తన్ను కాపాడుకొను విధము |
| 4:1-9 | హెచ్చరికలు |
| 4:9-22 | తిమోతికి పౌలు సందేశము – పౌలు వీడ్కోలు |

# తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక 1వ అధ్యాయము

## శుభము – కృతజ్ఞతా స్తుతి

క్రీస్తుయేసు నందున్న జీవమును గూర్చి వాగ్దానమునుబట్టి దేవుని చిత్తమువలన క్రీస్తుయేసు
అపొస్తలుడైన పౌలు ప్రియ కుమారుడగు తిమోతికి శుభమని చెప్పి వ్రాయునది – 2 తండ్రియైన దేవుని
నుండియు మన ప్రభువైన క్రీస్తు యేసు నుండియు కృపయు కనికరమును సమాధానమును కలుగును గాక. 3
నా ప్రార్థనల యందు ఎడతెగక నిన్ను జ్ఞాపకము చేసుకొనుచు, నీ కన్నీళ్లను తలచుకొని నాకు
సంపూర్ణానందము కలుగుటకై నిన్ను చూడవలెనని రేయింబవళ్లు అపేక్షించుచు నీయందున్న నిష్కపటమైన
విశ్వాసమును జ్ఞాపకము చేసికొని, 4 నా పితురాచార ప్రకారము నిర్మలమైన మనస్సాక్షితో నేను సేవించు
చున్న దేవుని యెడల కృతజ్ఞుడనై యున్నాను. 5 ఆ విశ్వాసము మొదట నీ అవ్వయైన లోయిలోను నీ తల్లియైన
యునీకేలోను వసించెను, అది నీయందు సహా వసించుచున్నదని నేను రూఢిగా నమ్ముచున్నాను.

## ప్రోత్సాహము కొరకైన హెచ్చరికలు

6 ఆ హేతువుచేత నా హస్త నిక్షేపణము వలన నీకు కలిగిన దేవుని కృపావరము ప్రజ్వలింప
చేయవలెనని నీకు జ్ఞాపకము చేయుచున్నాను. 7 దేవుడు మనకు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ
నిగ్రహమును, స్వస్థబుద్ధియు గల ఆత్మనే ఇచ్చెను గాని పిరికితనము గల ఆత్మ నియ్యలేదు. 8 కాబట్టి నీవు
మన ప్రభువు విషయమైన సాక్ష్యమును గూర్చియైనను ఆయన ఖైదీనైన నన్ను గూర్చియైనను సిగ్గుపడక దేవుని
శక్తిని బట్టి సువార్త నిమిత్తమైన శ్రమానుభవములో పాలివాడవై యుండుము. 9 మనక్రియలను బట్టి కాక తన
స్వకీయ సంకల్పమును బట్టియు అనాది కాలముననే క్రీస్తుయేసు నందు మనకు అనుగ్రహింపబడినదియు
క్రీస్తుయేసను మన రక్షకుని ప్రత్యక్షత వలన బయలు పరచబడినదియునైన తన కృపను బట్టియు మనలను
రక్షించి తన పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను. 10 ఆ క్రీస్తుయేసు మరణమును నిరర్థకము
చేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చెను. 11 ఆ సువార్త విషయములో నేను
ప్రకటించు వాడను గాను అపొస్తలుడను గాను బోధకుడను గాను నియమింపబడితిని. 12 ఆ హేతువు
చేత ఈ శ్రమలను అనుభవించుచున్నాను గాని నేను నమ్మినవానిని ఎరుగుదును గనుక సిగ్గుపడను. నేను
ఆయనకు అప్పగించిన దానిని రాబోవుచున్న ఆ దినము వరకు ఆయన కాపాడగలడని రూఢిగా
నమ్ముకొనుచున్నాను. 13 క్రీస్తుయేసు నందుంచవలసిన విశ్వాస ప్రేమలు కలిగిన వాడవై, నీవు నావలన వినిన
హిత వాక్య ప్రమాణమును గైకొనుము. 14 నీకు అప్పగింపబడిన ఆ మంచి పదార్థమును మనలో నివసించు
పరిశుద్ధాత్మ వలన కాపాడుము. 15 ఆసియలోని వారందరు నన్ను విడిచిపోయిరను సంగతి
నీవెరుగుదువు వారిలో ఫుగెల్లు హెర్మొగెనే అనువారున్నారు. 16 ప్రభువు ఒనేసిఫోరు ఇంటి వారియందు
కనికరము చూపును గాక. 17 అతడు రోమాకు వచ్చినప్పుడు నా సంకెళ్లను గూర్చి సిగ్గుపడక శ్రద్ధగా నన్ను
వెదకి కనుగొని, అనేక పర్యాయములు ఆదరించెను. 18 మరియు అతడు ఎఫెసులో ఎంతగా ఉపచారము
చేసెనో అది నీవు బాగుగా ఎరుగుదువు. ఆ దినమందు అతడు ప్రభువు వలన కనికరము పొందునట్లు ప్రభువు
అనుగ్రహించును గాక.